క్లుప్తంగా

2,900 పోస్టల్ బ్యాలెట్లు

4వ తేదీ నుంచి ఓటింగ్

పెనమలూరు: పెనమలూరు నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 2,900 ఉన్నాయని ఏఆర్ఓ ప్రసాద్ తెలిపారు. ఆయన గురువారం వివరాలు తెలుపుతూ ఎన్నికల విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు ఓటు వేయటానికి కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. ఇందులో భాగంగా 3,339 మంది ఉద్యోగుల నుంచి దరఖాస్తులు అందాయన్నారు. వీటిలో పెనమలూరు నియోజకవర్గానికి చెందిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 2,900 ఉండగా, ఇతర నియోజకవర్గాలకు చెందిన ఓట్లు 439 ఉన్నాయన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేయటానికి పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫెసిలిటేట్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. 4,5,6 తేదీలలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఇక్కడ వేయాలన్నారు. పైన తెలిపిన తేదీలలో ఓటు వేయని వారికి 6,7 తేదీలలో పెనమలూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఓట్లు వేయటానికి అవకాశం కల్పిస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు, పోలింగ్ తేదీలలో మార్పు జరిగితే ప్రకటిస్తామన్నారు.

స్థానికులతోనే నియోజకవర్గ అభివృద్ధి



ఉంగుటూరు: స్థానికుడైన వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్‌ను గెలిపించుకుంటేనే నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమవుతోందని డీబీపీఎస్ అధ్యక్షుడు అన్నవరపు నాగేశ్వరరావు అన్నారు. ఉంగుటూరు మండలం నాగవరప్పాడు గ్రామంలో చెరువు, పంటకాలువల పూడికతీత పనులు చేస్తున్న ఉపాధి హామి కూలీలతో గురువారం ఆయన మాట్లాడారు. వంశీమోహన్ స్థానికుడు కావడంతో రోడ్లు, సాగునీటి సమస్యలను పరిష్కరిస్తున్నారని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు ఫ్యాను గుర్తుకు ఓటువేసి ఎమ్మెల్యేగా వంశీమోహన్‌ను గెలిపించుకోవాలని నాగేశ్వరరావు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతల విస్తృత ప్రచారం



పి.నైనవరం(విజయవాడరూరల్): ఫ్యాను గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్‌ను గెలిపించాలని కోరుతూ గురువారం పి.నైనవరం గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గ్రామంలో లబ్ధిపొందిన వారి కుటుంబాలకు వెళ్లి సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలిపించుకోవాల్సిన అవసరం వుందన్నారు. దావు వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో ఎస్సీ, బీసీ కాలనీల్లో ఎన్నికల ప్రచారం జరిగింది. గ్రామ సర్పంచి బట్టా సోమయ్య, మాజీ సర్పంచి దావు కోటేశ్వరావు, రామకృష్ణ, డి.రాజు, దావు జోసెఫ్, శెట్టి సుబ్బారావు, జోగి శ్రీనివాసరావు, కాళిదాసు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి మద్దతుగా ప్రచారం



గన్నవరం: పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి వైఎస్సార్ సీపీతోనే సాధ్యమని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్, ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావుకు మద్దతుగా గురువారం స్థానిక ఎస్సీ కాలనీలో పార్టీ నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నేతలు కుర్రాటి అరుణకుమారి, సూరెడ్డి మణిమ్మ తదితరులు పాల్గొన్నారు. స్థానిక బుద్దవరం రోడ్డు, గొడపేట ప్రాంతంలో వైఎస్సార్‌సీపీ నేతలు గడప గడపకు ప్రచారం నిర్వహించారు. పలువురు వార్డు సభ్యులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

హోం ఓటింగ్ వేగవంతం చేయండి



హోం ఓటింగ్ ప్రక్రియను తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

- జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ
- ఉయ్యూరులో హోం ఓటింగ్ ప్రక్రియ పరిశీలన



పెద్ద అవుటపల్లిలో హోం ఓటింగ్ వేస్తున్న వృద్ధురాలు

ఉయ్యూరు: హోం ఓటింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డీకే బాలాజీ ఆదేశించారు. ఉయ్యూరు పట్టణంలో హోం ఓటింగ్ ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. హోం ఓటరు ఐలూరి నాగరాజు ఇంటి వద్దకు వెళ్లి హోం ఓటింగ్ బృందం నిర్వహిస్తున్న ఓటింగ్ తీరును పరిశీలించారు. ఎన్నికల నియమావళికి అనుగుణంగా ఓటరు డిక్లరేషన్ తీసుకోవాలని, బ్యాలెట్ నంబరు, ఓటరు సీరియల్ నమోదు చేయాలని రహస్య పోలింగ్ జరిగేలా చూడాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ ఎన్నికల సంఘం 85 ఏళ్లు నిండిన వృద్ధులు, దివ్యాంగులకు హోం ఓటింగ్ అవకాశం కల్పించిందన్నారు. పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటు వేయలేని స్థితిలో ఉన్నవారికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం తీసుకొచ్చారన్నారు. ఈ విధానాన్ని ఓటర్లు సక్రమంగా వినియోగించుకునేలా హోం ఓటింగ్ బృందాలు బాధ్యతతో పనిచేయాలన్నారు. హోం ఓటింగ్ ప్రక్రియ జిల్లాలో సమర్థంగా జరుగుతుందన్నారు. పెనమలూరు నియోజకవర్గంలో హోం ఓటింగ్‌కు అర్హత గల 379 మంది ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో పెనమలూరు రిటర్నింగ్ అధికారి డి.రాజు, మున్సిపల్ కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, తహసీల్దార్ గురుమూర్తి రెడ్డి, హోం ఓటింగ్ పీఓ పీవీ రమణ, మైక్రో అబ్జర్వర్ కనకదుర్గ పాల్గొన్నారు.

హోం ఓటింగ్‌లో సీక్రసీ ఆఫ్ ఓటింగ్ తప్పనిసరి

ఉంగుటూరు: వృద్ధులు, దివ్యాంగులు హోంఓటింగ్ సక్రమంగా వినియోగించుకునేలా హోం ఓటింగ్ బృందంగా కృషి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. ఉంగుటూరు మండలం పెద్ద అవుటపల్లిలో హోం ఓటింగ్ నిర్వాహణ తీరును గురువారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం 85 ఏళ్లు పైబడిన వృద్ధులకు, దివ్యాంగులు, పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటు వేయలేని స్థితిలో ఉన్నవారికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించిందన్నారు. ఈ సౌకర్యాన్ని వారు సక్రమంగా వినియోగించుకునేలా బృందాలు కృషి చేయాలన్నారు. పెద్ద అవుటపల్లిలోని 85 ఏళ్లు పైబడిన ఓటర్ ఎర్రంశెట్టి సూర్యావతి ఇంటి వద్ద హోం ఓటింగ్‌ను పరిశీలించారు. ఎన్నికల నిబంధనల మేరకు ఓటరు డిక్లరేషన్ తీసుకుని, బ్యాలెట్ నంబర్, ఓటర్ సీరియల్ కరెక్ట్‌గా వేయాలని, సీక్రసీ ఆఫ్ ఓటింగ్‌ను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గన్నవరం, ఉంగుటూరు తహసీల్దార్‌లు పవన్ కుమార్, జేవీ సుబ్బారావు, హోం ఓటింగ్ బృందంలో పీవోలు పి.దాస్, కే మాధవరావు, మైక్రో అబ్జర్వర్ చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న గెలుపుతోనే పేదలకు న్యాయం



పెదపులిపాక గ్రామంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి జోగి రమేష్

మంత్రి జోగి రమేష్

పెనమలూరు: జగనన్న గెలుపుతోనే పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జోగి రమేష్ అన్నారు. పెదపులిపాక గ్రామంలో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ జగనన్న ప్రజల మనిషన్నారు. ప్రజలకు ఉన్న కష్టసుఖాలు తెలిసిన వ్యక్తిగా జగనన్న పాలన సాగించారని తెలిపారు. గత ఐదేళ్ల పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఓబీసీలకు చెందిన కటుంబాలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని అన్నారు. పేదలకు సంక్షేమ పథకాలే కాకుండా వారి పిల్లలు ఉన్నత చదువులకు విద్యా విధానంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారని తెలిపారు. నేడు ప్రభుత్వ బడులు పేద విద్యార్థులకు దేవాలయాలుగా మారాయని అన్నారు. ఉన్నత చదువులు చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ జగనన్న ఇస్తున్నారని తెలిపారు. రానున్న కాలంలో కూడా ప్రజల పక్షాన జగనన్న నిలిచి వారి సంక్షేమానికి కట్టుబడి ఉంటారని వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే తిరిగి జగనన్నను సీఎం చేయాలని కోరారు. పెనమలూరులో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసి ప్రజలకు అండగా నిలుస్తానని జోగి రమేష్ తెలిపారు.

మోసగాళ్ల కూటమి

ఈ ఎన్నికలలో పోటీ చేస్తున్న మూడు పార్టీల కూటమి మోసగాళ్ల కూటమని మంత్రి జోగి రమేష్ ఆరోపించారు. 2014 ఎన్నికలలో టీడీపీ, బీజేపీ, జనసేక పార్టీలు ఏకమై పోటీ చేశాయన్నారు. అధికారం వచ్చిన తరువాత రాష్ట్రాభివృద్ధి, ప్రజాసేవను వదిలి మూడుపార్టీలు కొట్టుకున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా రాకుండా కుట్రపన్ని రాష్ట్ర భవిష్యత్తునే దెబ్బతీశారని విమర్శించారు. ఇప్పుడు సిగ్గులేకుండా మరలా మూడు పార్టీలు కూటమి పేరుతో దొంగ మేనిఫెస్టో విడుదల చేసి మోసానికి సిద్ధపడ్డారని ధ్వజమెత్తారు. గతంలో ఇచ్చిన హామీలు చంద్రబాబు ఎందుకు అమలు చేయలేదో ప్రజలు నిలదీయాలని అన్నారు. గ్రామ సర్పంచి గుంటూరు శ్రీనివాసాచౌదరి, నేతలు దేవినేని స్మిత, ఈడే చాముండేశ్వరి, మల్లంపల్లి వెంకటేశ్వరరావు, ఎస్.సాంబశివరావు,కోసూరి నరేష్‌కుమార్, శీలం శ్రీరాములు, లింగాల శోభన్‌బాబు, షేక్.ఫరీద్, కలీల్, అమీర్‌ఖాన్, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌కు మరోమారు పట్టం కట్టాలి

వైఎస్సార్ సీపీ గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్



బొమ్ములూరులో వంశీకి మంగళ హారతులు పడుతున్న మహిళలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ఐదేళ్ల పరిపాలన సాగించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు మరోమారు పట్టం కట్టాలని వైఎస్సార్ సీపీ గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ కోరారు. కంద్రిక, బొమ్ములూరు, కొయ్యూరు, తిప్పనగుంట, సిరివాడ, బిళ్లనపల్లి, కొత్తపల్లి, మడిచర్ల గ్రామాల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వంశీకి గ్రామగ్రామాన బ్రహ్మరథం పట్టారు. బొమ్ములూరు, కొయ్యూరు, తిప్పనగుంట గ్రామాల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ప్రచార రథంపై గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీతో పాటుగా వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ గోసుల శివభరత్‌రెడ్డి గ్రామంలో పర్యటించారు. మహిళలు మంగళహారతులు పడుతూ అభిమానాన్ని చాటుకున్నారు. యువత బైక్ ర్యాలీతో ప్రచారంలో హోరెత్తించారు. తిప్పనగుంటలో పీఏసీఎస్ చైర్మన్ మూల్పూరు ప్రభుకాంత్ ఆధ్వర్యంలో వంశీకి భారీ గజమాలను క్రేన్ సాయంతో వేశారు. బొమ్ములూరులో వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు కూడా వచ్చి పార్టీ శ్రేణులను కలిశారు. సంక్షేమ పథకాలు కొనసాగటానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ రావాలని ఆయన చెప్పారు. ప్రస్తుత ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గన్నవరం ఎమ్మెల్యే, మచిలీపట్నం పార్లమెంట్ స్థానాలను అఖండ మెజార్టీతో గెలిపించాలని వంశీ కోరారు. కొయ్యూరులో జరిగిన ప్రచారంలో పెరికీడుకు చెందిన యువకులు వంశీ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. బిళ్లనపల్లిలో టీడీపీ నేత దేవినేని కిషోర్‌కు వైఎస్సార్ సీపీ కండువా కప్పి వల్లభనేని వంశీ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఏపీ ఆర్టీసీ చైర్మన్ కనుమూరి సుబ్బరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ, జేసీఎస్ మండల కన్వీనర్ ఆవిర్నేని శేషగిరిరావు, పార్టీ నాయకులు చెరుకూరి శ్రీనివాస్, కొల్లి బ్రహ్మారావు, చిన్నాల సత్యగణేష్, యర్రంశెట్టి రామాంజనేయులు, మరీదు రాంబాబు, చెన్నుబోయిన శివయ్య, పడకల వీర్రాజు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి యువ ఫ్రెండ్స్ సర్కిల్



వంశీమోహన్ సమక్షంలో పార్టీలో చేరిన నేతలు

గన్నవరం: స్థానిక యాదవులపేటకు చెందిన యువ ఫ్రెండ్ సర్కిల్ సభ్యులు 40 మంది సర్నాల రమేష్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి వంశీమోహన్ వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు పట్ల అన్ని వర్గాల ప్రజలు ఆకర్షితులవుతున్నారని చెప్పారు. ప్రజలందరి మద్దతుతో రానున్న ఎన్నికల్లో విజయం సాధించి గన్నవరంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తానని ధీమా వ్యక్తం చేశారు. తన గెలుపు కోసం స్వచ్ఛందంగా ముందుకువచ్చి మద్దతు తెలిపిన యువ ఫ్రెండ్ సర్కిల్ సభ్యులను ఆయన అభినందించారు. పార్టీలో చేరిన వారిలో కురాకుల దుర్గప్రసాద్, ధనబాబు, బండారు రాజేష్, సర్నాల సాయికిరణ్, కాట్రు రామకృష్ణ, చిమట నాని, హేమర్తి తేజ, చిమట నాగరాజు, మసిముక్కు అయ్యప్ప తదితరులు ఉన్నారు. వార్డు సభ్యులు చిమట శ్రీనివాసరావు(మీసాల శ్రీను), లుక్కా ప్రసాద్, పడమట నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పథకాలను చూసి వైఎస్సార్ సీపీని గెలిపించండి



నున్నలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నున్న(విజయవాడరూరల): సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం నున్న గ్రామంలో ప్రచారం చేశారు. బోడపాడులో 13, 14 వార్డులో ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రతి ఇంటికీ చేకూరిన లబ్ధిని తెలియజేశారు. ఈ పథకాలన్నీ కొనసాగాలంటే మళ్లీ మన జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని సూచించారు. గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్, ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావులను అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ పార్టీ కన్వీనర్ పోలారెడ్డి చంద్రారెడ్డి, గ్రామ సర్పంచి కాటూరి సరళ, కలకోటి బ్రహ్మానంద రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు బొంతు సరోజిని, పోలారెడ్డి ప్రసాద్‌రెడ్డి, పెండెం గిరిజాకుమారి, ప్రత్తిపాటి రవీంద్ర, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, పార్టీ నాయకులు జీతం శ్రీనివాసరావు, భీమవరపు శివరామిరెడ్డి, అంగజాల హనుమా, మాజీ సర్పంచి కర్రె విజయ్‌కుమార్, పెయ్యల రాజా, పెయ్యల రజని, స్థానిక పార్టీ నాయకులు, కన్వీనర్లు, దండు సుబ్రహ్మణ్యంరాజు, స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ముమ్మర ప్రచారం



సూరంపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గన్నవరం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం రాత్రి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ విజయాన్ని ఆకాంక్షిస్తూ పార్టీ శ్రేణులు ముమ్మర ప్రచారం నిర్వహించారు. రామచంద్రాపురం, సూరంపల్లి గ్రామాల్లో పార్టీ నాయకులు ఇంటింటికీ వైఎస్సార్ సీపీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రతి గడపకు సంక్షేమాన్ని అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరు అండగా నిలవాలని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. రామచంద్రాపురంలో గ్రామ కన్వీనర్ సర్నాల రాంబాబు, కూరాకుల కోటేశ్వరరావు, కాజా సుబ్బారావు, ముమ్మరంగా ప్రచారం చేశారు.

గన్నవరం: మండలంలో కేసరపల్లిలో గురువారం గ్రామ సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీకి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సర్పంచితో పాటు జెడ్పీటీసీ ఎలిజబెత్‌రాణి, వైస్ ఎంపీపీ కాలగడ్డ శివనాగరాజకుమారి, పార్టీ నేతలు ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యేగా డాక్టర్ వల్లభనేని వంశీమోహన్, ఎంపీగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావును గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. పార్టీ నేతలు కొలుసు వెంగళరావు, దాసరి శ్రీనివాసరావు, పలగాని శివాజీ పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు. బుద్దవరంలో ఉపసర్పంచి వేల్పూరి బసవరావు నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా మద్దతుగా గడప గడపకు ప్రచారం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 7.30 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగుతుందని విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం గ్రామంలోని పటేల్‌నగర్, సాయి నగర్, హనుమాన్‌నగర్, టెంపుల్ ఏరియా, ఫ్లెఓవర్ దిగువ ప్రాంతం, రైల్వేస్టేషన్ కట్ట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు మంత్రి జోగి ఎన్నికల ప్రచారం

కంకిపాడు: మండలంలోని పలు గ్రామాల్లో ఈ నెల 3వ తేదీన ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు గురువారం తెలిపారు.రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ ప్రచారంలో పాల్గొంటారు . శుక్రవారం ఉదయం 7 గంటలకు చలివేంద్రపాలెం, సాయంత్రం 5 గంటలకు ప్రొద్దుటూరు గ్రామంలో ఇంటింటి ప్రచారం సాగుతుందన్నారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తారన్నారు. ప్రచార కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

తప్పుడు ప్రచారం తగదు

కంకిపాడు: ల్యాండ్ టైట్లింగ్ యాక్టుపై చంద్రబాబు, కూటమి తప్పుడు ప్రచారం చేస్తోందని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొండవీటి వెంకట సుబ్బారావు విమర్శించారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కేంద్రం ఎంతో ప్రతిష్టాత్మకంగా భూ సమస్యలను పరిష్కరింప చేసే విధంగా ల్యాండ్ టైట్లింగ్‌చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. కూటమిలో అంటకాగుతూనే చట్టం అమలుపై విష ప్రచారం చేస్తూ ప్రజల్ని గందరగోళానికి గురిచేస్తుందన్నారు. రైతులకు ఇబ్బంది లేని విధంగా మేలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతాంగం చంద్రబాబుకు, ఆయన మిత్ర కూటమికి తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పీట

రామవరప్పాడు: అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధికి పెద్ద పీట వేశారని గొల్లపూడి మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు అన్నారు. విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లో గురువారం వైఎస్సార్ సీపీ గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ విజయాన్ని కాంక్షిస్తూ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ పర్యటిస్తూ సంక్షేమ పథకాలు వివరించారు. ప్రసాదంపాడులో ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ సువర్ణరాజు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ జగనన్న మేనిఫెస్టోను వివరించారు. ప్రచారంలో యూత్ నాయకులు పిన్నిబోయిన రవికుమార్, మాజీ ఉపసర్పంచ్ చెన్ను కమల్‌రాజు, రామవరప్పాడులో సర్పంచ్ వరి శ్రీదేవి, ఎనికేపాడులో సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు, కోనేరు సుబ్బారావు, నిడమానూరులో సర్పంచ్ శీలం రంగారావు, మహిళా అధ్యక్షురాలు పరిమి సింధూర పాల్గొన్నారు.

ఈవీఎం కమిషనింగ్ పరిశీలన



ధనేకుల కాలేజీలో ఈవీఎం కమిషనింగ్ వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ డీకే బాలాజీ

పెనమలూరు: ఈవీఎం కమిషనింగ్‌ను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డీకే.బాలాజీ పరిశీలించారు. ఆయన గురువారం గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో స్ట్రాంగ్ రూమ్ పరిశీలించారు. అనంతరం ఈవీఎం కమిషనింగ్ సక్రమంగా చేశారా లేదా అనే విషయమై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బ్యాలెట్ యూనిట్‌లో పేపర్ ఏర్పాటు చేయటం, కంట్రోల్ యూనిట్‌లో అభ్యర్థుల పేర్లు, వారి గుర్తులు లోడ్ చేయటం, అనంతరం సీల్ చేయటం పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్ పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పెనమలూరు ఆర్ఓ డి.రాజు, తహసీల్దార్ ప్రసాద్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

మండుటెండలో ఏడిపింఛెన్



కంకిపాడు లాకురోడ్డులోని బ్యాంకు వద్ద క్యూ కట్టిన లబ్ధిదారులు

కంకిపాడు/పెనమలూరు/ఉంగుటూరు: చంద్రబాబు అండ్ కో పన్నిన పన్నాగంతో పింఛను లబ్ధిదారులకు అగచాట్లు తప్పటం లేదు. వరుసగా రెండో నెల కూడా పింఛను సకాలంలో చేతికి అందక అవస్థలు పడ్డారు. పింఛను సొమ్మును బ్యాంకు ఖాతాల్లో జమ చేయటంతో బ్యాంకుల వద్ద క్యూ కట్టారు. గంటల కొద్దీ ఎండలో నిరీక్షించి అలిసిపోయారు. చంద్రబాబు తోక సంస్థల చర్యలపై లబ్ధిదారులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. పింఛనుతో బతికే తమను ఇబ్బంది పెడితే ఏం లాభం వస్తుంది?..బుద్ధి ఉందా? అంటూ బాహాటంగా తిట్లు, శాపనార్థాలు పెట్టారు.

ఎండలో అల్లాడిపోయాం..



వలంటీరు వచ్చి పింఛను అందించేవాళ్లు. కానీ ఇప్పుడేమో బ్యాంకుల్లో వేశారు. బ్యాంకులకు వెళ్లి క్యూలో ఎండలో నిలబడలేక చాలా ఇబ్బంది పడాల్సి వచ్చింది. గత ప్రభుత్వాల సమయంలో పింఛను కోసం పడ్డ ఇబ్బందులు గుర్తుకు వచ్చాయి. ఇలాంటి ఇబ్బందులు మళ్లీ రాకూడదు. మళ్లీ జగన్‌వస్తేనే వలంటీరు వ్యవస్థ మళ్లీ వస్తుంది. వాళ్లే ఇంటింటికీ వచ్చి పింఛను ఇస్తారు. అదే కోరుకుంటున్నాం.

-నందం భీమరాజు, పింఛను లబ్ధిదారు, కంకిపాడు

జగన్‌తోనే మాకు న్యాయం



గడ్డం బాబుల కుట్రల వల్లే మాకు ఈ ఇబ్బందులు. ఇన్నాళ్లూ ఎంతో హాయిగా పింఛను తీసుకున్నాం. ఎన్నికల పేరుతో మా జీవితాలతో ఆడుకుంటున్నారు. ఒక్క జగన్ వల్లే మాకు న్యాయం జరుగుతుందనే నమ్మకం మాకు ఉంది. ఆయనకే మా మద్దతు.

-షేక్ ఫైజున్నీసా, పింఛను లబ్ధిదారు, కంకిపాడు

జగనే రావాలి..వలంటీర్లు కావాలి



మరలా జగనే రావాలి, వలంటీర్లు వచ్చి తమకు పింఛన్లు ఇంటింటికీ అందజేయాలి. వలంటీర్లు లేక పోవటంతో రెండు నెలలుగా పింఛన్ కోసం చాలా ఇబ్బంది పడుతున్నాను. ఎండ తీవ్రతతో చేతికి పింఛన్ అందేలోపే ప్రాణలు పోయేలా ఉన్నాయి. జగన్‌తోనే మాకు మంచి రోజులు వస్తాయి.

-కొండవీటి శారమ్మ, పెదపులిపాక

హోం ఓటింగ్ వాహనం ప్రారంభం



పెనమలూరులో హోం ఓటింగ్ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఆర్ఓ రాజు

పెనమలూరు: హోం ఓటింగ్ ప్రక్రియ విజయవంతంగా నిర్వహించటానికి అన్ని ఏర్పాట్లు చేశామని పెనమలూరు రిటర్నింగ్ అధికారి డి.రాజు అన్నారు. పెనమలూరు నియోజకవర్గంలో హోం ఓటింగ్‌కు రిటర్నింగ్ అధికారి డి.రాజు జెండా ఊపి గురువారం వాహనలను ప్రారంభించారు. రిటర్నింగ్ అధికారి రాజు వివరాలు తెలుపుతూ పెనమలూరు నియోజకవర్గంలతో 85 సంవత్సరాలు పైబడిన ఓటర్లు, అలాగే 40 శాతంతో అంగవైకల్యం ఉన్న ఓటర్లు హోం ఓటింగ్ కోసం దరఖాస్తు చేశారన్నారు. తాము అన్ని పరిశీలించి 379 మందికి హోం ఓటింగ్‌కు అనుమతులు ఇచ్చామని తెలిపారు. హోం ఓటింగ్‌కు ఆరు టీమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఆరు టీమ్‌లు ఆరు రూట్‌లలో వాహనాలలో వెళ్లి 379 మంది వద్ద బ్యాలెట్‌తో ఓటు హక్కు వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకుంటారని అన్నారు. ఒక్కో టీమ్‌లో పీఓ, ఏపీవో, మైక్రోఅబ్జర్వర్, పోలీస్, వీడియోగ్రాఫర్ ఉంటారన్నారు. ఆయా పోలింగ్ కేంద్రం పరిధిలో ఉన్న హోం ఓటర్లకు బీఎల్‌వో ఉంటారని తెలిపారు. హోం ఓటర్లు ఉంటున్న ఇళ్లకు అధికారులు చేరుకొని ఓటు హక్కు వినియోగించుకునే విధంగా సహకరిస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, సీఐ టీవీవీ.రామారావు, డీటీలు భవాని, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.